క్లుప్తంగా

విగ్రహ ప్రతిష్ఠ పూజలు ప్రారంభం



పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని బెలుం సిద్ధరామేశ్వరస్వామి ఆలయంలో సోమవారం విగ్రహ ప్రతిష్ఠ పూజలు ప్రారంభమయ్యాయి. వేదపండితులు ఆలూరి రాఘవేంద్రప్రసాద్, సతీష్‌శర్మ ఆధ్వర్యంలో యాగశాల ప్రవేశం, గోపూజ, గణపతి పూజ తదితర పూజలు నిర్వహించారు. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం చివరి రోజు బుధవారం సిద్ధ వినాయక, పర్వత వర్ధిని, గంగాదేవి, నవగ్రహ, నందీశ్వర విగ్రహాలు ప్రతిష్ఠ చేయనున్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న పార్టీ నాయకులు

డోన్: నిరుపేద, మధ్యతరగతి ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం ఆరోగ్యశ్రీతో పాటు ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ఎంతగానో ఉపయోగపడుతోందని మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కొత్తకోట చంద్రన్న యాదవ్ అన్నారు. ఆర్థిక మంత్రి బుగ్గన స్వగృహంలో సోమవారం మండలంలోని గుమ్మకొండ గ్రామానికి చెందిన వడ్డె అనంతమ్మకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.50 వేల చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు తలారి చిన్న హనుమన్న, నాయకులు తలారి అంజి, వెంకటేశులు, గంగాధర్, లాలప్ప, నరసింహులు, బొజ్జన్న, చిరంజీవి పాల్గొన్నారు.

సారా విక్రేతల అరెస్ట్

బనగానపల్లె రూరల్: బనగానపల్లె సెబ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొలిమిగుండ్ల, అవుకు, బనగానపల్లె ప్రాంతాల్లో దాడులు నిర్వహించి సారా విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు సీఐ జోగేంద్ర సోమవారం తెలిపారు. కొలిమిగుండ్ల మండలం బెలుం గ్రామానికి చెందిన సికిరి హుస్సేని వద్ద 20 లీటర్లు, అవుకు మండల రామాపురం గ్రామానికి చెందిన ఓబులేసు వద్ద 30 లీటర్లు, మంగంపేటతాండాకు చెందిన పరశురామ్ నాయక్ వద్ద 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. మోటర్ సైకిల్‌ను సీజ్ చేశామన్నారు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నేడు కృష్ణమ్మకు జలహారతి

బేతంచెర్ల: గోరుకల్లు రిజర్వాయర్ నుంచి కృష్ణా జలాలు బేతంచెర్ల పట్టణానికి మంగళవారం రానుండడంతో జలహారతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి, కమిషనర్ రమేష్ బాబు తెలిపారు. సోమవారం పట్టణంలోని ధరణి టౌన్‌షిప్పులోని వాటర్ సంప్ వద్ద జలహారతి నిర్వహించడానికి ఏర్పాట్లను పరిశీలించారు.

మంత్రిని కలిసిన శాప్‌నెట్‌వర్క్ చైర్మన్



మంత్రి బుగ్గనను సత్కరిస్తున్న వెంకటేష్

ఎమ్మిగనూరుటౌన్: ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిని బేతంచర్లలోని ఆయన నివాసంలో సోమవారం రాష్ట్ర శాప్ నెట్‌వర్క్ సొసైటీ చైర్మన్ మాచాని వెంకటేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. చైర్మన్‌గా తనను నియమించినందున కృతజ్ఞతలు తెలిపారు. కోఆపరేటివ్ స్టోర్స్ చైర్మన్ షబ్బీర్‌అహమ్మద్, నాయకులు మాచాని సోమేష్, హరిప్రసాద్ ఉన్నారు.

ప్రమాణస్వీకారం



ఆర్యవైశ్య మహిళా విభాగం నూతన కమిటీ

బనగానపల్లె: యాగంటి క్షేత్రంలోని వాసవీ అన్నదాన సత్రంలో సోమవారం ఆర్యవైశ్య సంఘం మహిళా విభాగం జిల్లా కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. అధ్యక్షురాలిగా బనగానపల్లెకు చెందిన జి.నాగసుప్రజ, ప్రధాన కార్యదర్శిగా ఎన్.ఉమామహేశ్వరి, కోశాధికారిగా లక్ష్మీ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా విజయలక్ష్మి, అదనపు కార్యదర్శిగా శ్రీలక్ష్మి ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ గౌరవాధ్యక్షురాలు జయంతి, రజనీ పాల్గొన్నారు.

ప్రభుత్వ మంచిని వివరిద్దాం

ప్యాపిలి: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని జెడ్పీటీసీ సభ్యుడు బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వ్యవసాయ సలహామండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వరరెడ్డి అన్నారు. జలదుర్గం గ్రామంలో మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమం నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో అభివృద్ధి పరుగులు

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి
- మీరాపురంలో రూ.1.40 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం



రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమంతో పాటు అభివృద్ధి పరుగులు తీస్తోందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. సోమవారం బనగానపల్లె మండలం మీరాపురం గ్రామంలో రూ.31.50 లక్షలతో బీటీ రోడ్డు, రూ.43.60 లక్షలతో సచివాలయ భవనం, రూ.23.94 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.20.80 లక్షలతో నిర్మించిన హెల్త్ క్లీనిక్, రూ.20 లక్షలతో ఏర్పాటు చేసిన సీసీరోడ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్ర సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేశారని తెలిపారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలను ఓటు అడిగే హక్కు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకే ఉందన్నారు. గత టీడీపీ పాలనలో చంద్రబాబునాయుడు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదని విమర్శించారు. మళ్లీ అధికారం కోసం అబద్ధపు హామీలను ఇస్తూ మరోసారి ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఆయన ఎన్ని హామీలు, ఎన్ని పార్టీలతో కలిసి వచ్చినా ప్రజలు సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అవుకు, బనగానపల్లె మండలాల వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు కాటసాని తిరుపాల్‌రెడ్డి, ఎస్.జనార్ధన్‌రెడ్డి, సర్పంచ్ నాగేశ్వరమ్మ, యాగంటి ఆలయ చైర్మన్ బుచ్చిరెడ్డి, పార్టీ నాయకులు ప్రతాప్‌రెడ్డి, మల్లీశ్వరరెడ్డి, బత్తుల రామ్మోహన్‌రెడ్డి, జగదీశ్వరరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, తిరుపాల్, పీఆర్ ఏఈ మహేష్, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ సాయికృష్ణ పాల్గొన్నారు.

యాగంటి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్ష

బనగానపల్లె రూరల్: యాగంటి క్షేత్రంలోని ఉమామహేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 7వ తేదీ నుంచి 11వ తేదీ వరకు జరిగే ఉత్సవాల్లో భక్తులకు అన్ని వసతులు కల్పించాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దేవదాయశాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని పొదుపు భవనంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఆలయ చైర్మన్ తొటబుచ్చిరెడ్డి అధ్యక్షతన అధికారులతో సమీక్షించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శివరాత్రి ఉత్సవాలకు ఏపీ, తెలంగాణ, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి ఎక్కువ సంఖ్యలో భక్తులు వచ్చే అకాశం ఉందన్నారు. భక్తులకు తాగునీరు, వసతి సౌకర్యాలను కల్పించాలన్నారు. దర్శనానికి ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేయాలని, 24 గంటల విద్యుత్ సౌకర్యం ఉండాలని ఆదేశించారు. వాహనల్లో వచ్చే భక్తులకు పార్కింగ్ స్థలం, ఆలయ ఆవరణలో శామియానాలను ఏర్పాటు చేయలన్నారు. ప్రసాదాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. భక్తులకు నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవన్నారు. ఆలయంలో 104 వాహనం అందుబాటులో ఉంచాలని, వైద్య శిబిరం ఏర్పాటు చేసి మందులను అందుబాటులో ఉంచుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. బనగానపల్లె ఆర్టీసీ నుంచి యాగంటి క్షేత్రానికి ప్రత్యేక బస్సు సర్వీస్‌లు ఏర్పాటు చేయాలన్నారు. చోరీలు జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. శివరాత్రి ఉత్సవాలు ముగిసేవరకు అధికారులందరూ సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని కోరారు. తహసీల్దార్ రవీంద్రారెడ్డి, ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, ప్రత్యేక అధికారి పాండురంగారెడ్డి, ఈఓఆర్‌డీ శివరామయ్య, ఎస్‌ఐ రామిరెడ్డి, ఫైర్ ఆఫీసర్ నరసింహులు, ఆలయ అర్చకుడు మహేశ్వరయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

కర్నూలుకు వెళ్లి పింఛన్ అందజేత

బనగానపల్లె రూరల్: బనగానపల్లె బీసీ కాలనీకి చెందిన ఎస్.హుస్సేన్‌సా అనారోగ్యంతో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ అనీల్‌కుమార్ సోమవారం సొంత ఖర్చులతో 72 కి.మీ దూరంలోని కర్నూలుకు వెళ్లి వృద్ధుడికి పింఛన్ అందజేశాడు. దీనిపై హుస్సేన్‌సా ఆనందం వ్యక్తం చేశాడు. వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేసి తమలాంటి వారికి అండగా నిలుస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని పేర్కొన్నాడు.

నాయినపల్లె నుంచి..

కొలిమిగుండ్ల: కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడికి నాయినపల్లెకు చెందిన వలంటీర్ వరలక్ష్మి సోమవారం పింఛన్ అందజేసింది. గ్రామానికి చెందిన బుర్గుల రాముడు అనారోగ్యంతో పది రోజుల నుంచి కర్నూలులో చికిత్స పొందుతున్నాడు. లేవలేని స్థితిలో ఉండడంతో వలంటీర్ అక్కడికి వెళ్లి బయోమెట్రిక్ తీసుకుని రూ.3 వేలను కుటుంబ సభ్యులకు అందజేసింది.



ఆస్పత్రిలో బయోమెట్రిక్ తీసుకుంటున్న వరలక్ష్మి



పింఛన్ అందజేస్తున్న వలంటీర్ అనీల్‌కుమార్

8న దేవరబండలో బండలాగుడు పోటీలు

డోన్ రూరల్: మహాశివరాత్రిని పురస్కరించుకుని మండల పరిధిలోని దేవరబండ గ్రామంలో ఈనెల 8వ తేదీ ఆరుపళ్లలోపు ఎద్దులకు బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. గెలుపొందిన ఎద్దులకు వరుసగా 40, 30, 20, 10, 5, 3 వేల రూపాలను బహుమతిగా అందజేస్తామన్నారు. అలాగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గెలుపొందిన వారికి 20, 15, 10, 5, 3 వేల రూపాయలను బహుమతిగా ప్రకటించారు. ఈ నెల 9వ తేదీ గిరిక బండి ఎద్దుల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేవలం పొలంలో పనులు చేసే ఎద్దులు మాత్రమే పాల్గొనాలని సూచించారు.

నేడు బూత్ కమిటీలతో ఎమ్మెల్యే సమావేశం

కొలిమిగుండ్ల: మండల కేంద్రంలోని షిర్డీసాయి ఫంక్షన్ హాల్‌లో మంగళవారం 'మేము సిద్ధం.. మా పోలింగ్ బూత్ సిద్ధం' కార్యక్రమంలో భాగంగా బూత్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఎన్నికల ప్రచారంపై దిశానిర్దేశం చేస్తారన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, బూత్ కమిటీ కన్వీనర్లు, గృహ సారథులు, నాయకులు తప్పక హాజరుకావాలని కోరారు.

నేడు గిద్దలూరుకు ఎమ్మెల్యే రాక

సంజామల: మండలంలోని గిద్దలూరు సాయి ఫంక్షన్ హాల్‌లో జరిగే 'మేము సిద్ధం..మా బూత్ సిద్ధం' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హాజరుకానున్నట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి గుండం సూర్యప్రకాష్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, బూత్ కన్వీనర్లు, గృహ సారథులు విజయవంతం చేయాలని కోరారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

డోన్: పట్టణ ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం అన్నారు. స్థానిక 18వ వార్డులో కౌన్సిలర్ మల్లికార్జునరెడ్డితో కలిసి సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటిని వృథా చేయవద్దని స్థానికులను కోరారు. మరో రెండు నెలల్లో గాజులదిన్నె ప్రాజెక్టు నీటితో పాటు గోరుకల్లు రిజర్వాయర్ నుంచి శుద్ధజలాన్ని ప్రతి ఇంటికీ పంపిణీ చేస్తామని తెలిపారు. మారుమూల వీధులకు సైతం విద్యుత్, డ్రైనేజీ, సీసీరోడ్లను నిర్మిస్తామని చెప్పారు. కాల్వల శుభ్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు.



డోన్ 18వ వార్డులో స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ జయరాం

బాల్య వివాహాలతో అనేక అనర్థాలు

డోన్ టౌన్: బాల్య వివాహాలతో అనేక అనర్థాలు ఉత్పన్నమవుతాయని.. వాటికి అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని సీనియర్ సివిల్ జడ్జి తంగమణి అన్నారు. స్థానిక పాతపేట జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం నిర్వహించిన బేటి బచావో, బేటి పడావో కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చేసినా, వాటిని ప్రోత్సహించినా చట్టరీత్యా నేరమన్నారు. ఈ వివాహాల వల్ల శారీరకంగా, మానసికంగా ఎన్నో ఇబ్బందులు వస్తాయని తెలిపారు. బాలికలను బాగా చదివిస్తే అద్భుతాలు చేయగలరన్నారు. వారిని అన్ని విధాలుగా ప్రోత్సహించాలని సూచించారు. అమ్మాయి చదువు అవనికి వెలుగని పేర్కొన్నారు. సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. ఆపద సమయంలో దిశయాప్ లేదా 100కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. పౌష్టికాహారం తీసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ శంషాద్‌బేగం, ఉపాధ్యాయులు జడ్జిని సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మావతి, ఉపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి, లీలావతమ్మ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పరమేశ్వరమ్మ, అనిత పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి తంగమణి

సేవా దృక్పథంతోనే వైద్య సేవలు

డోన్ టౌన్: ప్రైవేట్ ఆస్పత్రులపై అసత్య ప్రచారాలు మానుకోవాలని, సేవా దృక్పథంతోనే తక్కువ మొత్తానికి వైద్య సేవలు అందిస్తున్నట్లు పట్టణానికి చెందిన ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు తెలిపారు. స్థానిక కేవీఎస్ ఆస్పత్రిలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వైద్యులు శ్రీధర్, రాజశేఖర్, సుంకన్న, దీపిక, రాజేంద్రప్రసాద్‌రెడ్డి, భార్గవరెడ్డి మాట్లాడుతూ.. ఆస్పత్రికి వచ్చే రోగులకు తక్షణ వైద్య సహాయం అందించేందుకు అక్కడి డ్యూటీలో ఉన్న వైద్యులు, సిబ్బంది హాజరవుతారని.. ఈ విషయాన్ని కొంత మంది తప్పుదోవ పట్టిస్తున్నారని తెలిపారు. రాత్రి పగలు తేడా లేకుండా సేవలు అందించే వారిపై అసత్య ప్రచారాలు మానుకోవాలని హితవుపలికారు.

బాధితులందరికీ నష్టపరిహారం అందజేస్తాం



మాట్లాడుతున్న ఆర్డీఓ మహేశ్వర్‌రెడ్డి

బేతంచెర్ల: బేతంచెర్ల–వెల్దుర్తి రెండు వరుసల రహదారి నిర్మాణంలో ఇల్లు, స్థలం కోల్పోతున్న బాధితులందరికీ ప్రభుత్వం తరఫున నష్టపరిహారం అందజేస్తామని డోన్ ఆర్డీఓ మహేశ్వర్ రెడ్డి తెలిపారు. మండలంలోని ముద్దరం, ఎం.పేండేకల్లు గ్రామంలో రహదారి నిర్మాణానికి 64 సెంట్ల స్థలం అవసరం ఉంది. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, గ్రామస్తులతో ఆర్డీఓ సమావేశం నిర్వహించారు. రోడ్డు విస్తరణలో భూములు, ఇల్లు, స్థలం కోల్పోతున్న వారికి న్యాయం చేస్తామని ఆర్డీఓ తెలిపారు. తహసీల్దార్ జీవన్ చంద్రశేఖర్, డీటీ సత్యదీప్, మండల సర్వేయర్ జ్యోత్స్న, వీఆర్వోలు శివ రామయ్య, ఆర్‌అండ్‌బీ ఏఈ మునిస్వామి పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

కొలిమిగుండ్ల: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ గోపినాథ్‌రెడ్డి సోమవారం తెలిపారు. వివరాలు.. కాలనీలో నివాసం ఉండే నాయకంటి చిన్న కాంతన్న వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని భార్య జయమ్మను మానసింగా, శారీరకంగా వేధించేవాడు. ఈ విషయాన్ని జయమ్మ అత్త బజారమ్మ, బావ పెద్దకాంతకు తెలపడంతో వారు కూడా భర్తకు మద్దతుగా నిలిచి వేధించడం మొదలుపెట్టారు. అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు బెదిరించారు. జయమ్మ ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం

కోవెలకుంట్ల: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. 'నేను సిద్ధం.. నా బూత్ సిద్ధం' అనే కార్యక్రమంపై సోమవారం పంచాయతీ పరిధిలోని సచివాలయాల కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ప్రతి బూత్‌లో కన్వీనర్‌తోపాటు బూత్ అధ్యక్షుడిని నియమించుకోవాలన్నారు. ఈ నెల 12వ తేదీలోపు ఆయా గ్రామ సచివాలయాల పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి ఐదేళ్ల కాలంలో జగనన్న ప్రభుత్వం చేసిన మంచిని వివరించాలని సూచించారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, ఉపసర్పంచ్ జీసీ ఆర్ సూర్యనారాయణరెడ్డి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, రవీంద్రనాథరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి హర్షవర్ధన్‌రెడ్డి

ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు

ప్యాపిలి: వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని జెడ్పీటీసీ సభ్యుడు బోరెడ్డిశ్రీరామిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ మహేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం హుస్సేనాపురం గ్రామంలో సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లీనిక్ భవనాలను ప్రారంభించారు. సచివాలయాల ద్వారా స్థానికంగానే సంక్షేమ పథకాలు, సేవలు పొందవచ్చని తెలిపారు. రైతులకు విత్తనాలు, ఎరువులు గ్రామంలోనే లభ్యం అవుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాయి మనోహర్, నాయకులు బొర్రా మల్లికార్జున రెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో ఆధునిక సౌకర్యాలు



సీఎం సహాయ నిధి చెక్కును అందజేస్తున్న బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

- ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

బేతంచెర్ల: మారుతున్న కాలానికి అనుగుణంగా పాఠకులు, విద్యార్థుల కోసం గ్రంథాలయంలో కంప్యూటర్, ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయం సమీపంలో రూ. 40 లక్షలతో నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. గ్రంథాలయ సంస్థ సహకారంతో భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకుని జ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. పరీక్షల సమయం కావడంతో గ్రంథాలయం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఇందులో రెండు నెలల పాటు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్లు గ్రంథాలయ అధికారి మధుశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ప్రకాశ్, బేతంచెర్ల గ్రంథాలయ అధికారి మధుశేఖర్, నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి, కమిషనర్ రమేష్ బాబు, ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి పాల్గొన్నారు.



గ్రంథాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బుగ్గన, నగర పంచాయతీ చైర్మన్

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

పట్టణంలోని సంజీవనగర్ కాలనీకి చెందిన కురువ తిమ్మరాజు కుమారుడు రఘు అనారోగ్యంతో కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. వీరి ఆర్థిక పరిస్థితి దృష్ట్యా మంత్రి బుగ్గన సిఫార్సుతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. రూ.1.20 లక్షల చెక్కు మంజూరైంది. సోమవారం బుగ్గన చేతుల మీదుగా తిమ్మరాజుకు చెక్కును అందజేశారు. నాయకులు రాజేంద్రనాథ్‌రెడ్డి, బలరామిరెడ్డి, చంద్రారెడ్డి, గూని నాగరాజు, ఆనంద్ ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

బనగానపల్లె: వైఎస్సార్ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందుతున్నట్లు జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని పొదుపు భవనంలో అవుకు పట్టణానికి చెందిన 262 మంది లబ్ధిదారులకు ఇంటి స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అవుకు పట్టణంలో అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించడం వైఎస్సార్ ప్రభుత్వంలోనే సాధ్యమైందన్నారు. టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలు సిఫారసు చేసిన వారికే పథకాలు వచ్చేవని పేర్కొన్నారు. ప్రతి పేదవాడికి ప్రభుత్వ పథకాలు అందాలంటే మళ్లీ వైఎస్ జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. అవుకు మండలం వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాదబాబు పాల్గొన్నారు.



పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి

గ్రామాల్లో గణనీయమైన అభివృద్ధి

కొలిమిగుండ్ల: దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని గ్రామాలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గణనీయమైన అభివృద్ధి సాధించాయని జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. సోమవారం బి.ఉప్పలూరు, నాగిశెట్టిపల్లె, బి.తాడిపత్రి గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. జల్‌జీవన్ మిషన్ పథకం కింద మూడు గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల నిర్మాణం పూర్తి కావడంతో విద్యుత్ సరఫరా కల్పించేందుకు ట్రాన్స్‌కో ఏడీ ఖాజావలితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా బి.ఉప్పలూరు పంచాయతీలోని మూడు గ్రామాలకు నీటి వసతి, రోడ్లు ఉండేవి కావన్నారు. ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సహకారంతో ట్యాంక్‌లు నిర్మించి ఇంటింటికి కొళాయి కనెక్షన్‌లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. బి.తాడిపత్రి అంధకారంలో జీవిస్తున్న చెంచుల జీవితాల్లో వెలుగులు నింపామన్నారు. విద్యుత్ సరఫరా, తాగునీటి సౌకర్యం, రోడ్డు నిర్మించామని గుర్తు చేశారు. సంక్షేమంతో సమానంగా అభివృద్ధి జరుగుతోందని తెలిపారు. నాలుగున్నరేళ్లలో ఎన్నో సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపామన్నారు. సర్పంచ్ ఈశ్వరయ్య, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, కోవెలకుంట్ల మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు రామసుబ్బయ్య ఉన్నారు.



బి.తాడిపత్రిలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న జెడ్పీచైర్మన్ పాపిరెడ్డి

రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ


డోన్: పట్టణంలో గూడులేని పేదలందరికీ రాష్ట్ర ప్రభుత్వం జగనన్న కాలనీలో ఇంటి స్థలాలు మంజూరు చేయడంతో పాటు గృహాలను నిర్మించి ఇచ్చిందని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. సోమవారం డోన్ 7వ సచివాలయం పరిధిలోని కొండపేటలో 145 మంది లబ్ధిదారులకు పట్టా రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. పట్టణంలో 3 వేల మందికి స్థలాలతో పాటు దొరపల్లె, ఉడుములపాడు లేఅవుట్లలో ఇళ్లు నిర్మించి ఇచ్చినట్లు తెలిపారు. ఇప్పటికే విద్యుత్, రహదారి సౌకర్యం కల్పించామన్నారు.



రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజేష్

ప్రారంభానికి సిద్ధం

బనగానపల్లె రూరల్: పట్టణంలోని రవ్వలకొండపై రూ.83.19 లక్షలతో నిర్మించిన బహుళ ప్రయోజన గిడ్డంగిని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చేతుల మీదుగా బుధవారం ప్రారంభించనున్నట్లు భానుముక్కల సహకార సంఘం చైర్మన్ నీలి శ్రీనివాసులు తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, రైతులు హాజరుకావాలని కోరారు.



నూతనంగా నిర్మించిన గిడ్డంగి

వివాహిత ఆత్మహత్య


బనగానపల్లె రూరల్: కడుపునొప్పి తాళలేక వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని బీరవోలు గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన నాగమ్మ కుమార్తె ఆవుల కళ్యాణి(22)కి అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన ఆవుల పెద్దయ్య కుమారుడు హరినాథ్‌కు నాలుగేళ్ల క్రితం వివాహమైంది. హరినాథ్ పచ్చళ్ల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కళ్యాణికి అప్పుడప్పుడు కడపునొప్పి వస్తుండడంతో మనస్తాపంతో ఉండేది. మూడు రోజుల క్రితం కుటుంబ సభ్యులను చూసేందుకు కళ్యాణి బీరవోలు గ్రామానికి వచ్చింది. సోమవారం కడపు రావడంతో ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్‌ఐ తిరుపాల్ మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె ఏరియా వైద్యశాలకు తరలించారు. ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా మృతురాలికి రెండున్నరేళ్ల కుమారుడు ఉన్నాడు.



కళ్యాణి మృతదేహం

మద్యం స్వాధీనం.. ఇద్దరి అరెస్ట్

డోన్ రూరల్: అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు సెబ్ సీఐ జయనాథ్ రెడ్డి తెలిపారు. డోన్ సెబ్ కార్యాలయంలో సోమవారం నిందితుల అరెస్టు చూపించి వివరాలు వెల్లడించారు. నంద్యాల జిల్లా సెబ్ జాయింట్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, సూపరింటెండెంట్ రామ్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలో దాడులు నిర్వహించామన్నారు. గుత్తి రోడ్డులోని బంగారయ్య వీధికి చెందిన తమటం జయశ్రీ మద్యం విక్రయిస్తుండగా అరెస్టు చేసినట్లు తెలిపారు. ఆమె వద్ద నుంచి 50 టెట్రా ప్యాకెట్లు స్వాదీనం చేసుకున్నామన్నారు. అలాగే కొండపేట కాలనీకి చెందిన ఇండ్ల కన్నా నుంచి 119 కర్ణాటక టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు. వీరికి మద్యం సరఫరా చేస్తున్న పట్టణానికి చెందిన ఈడిగ పాండురంగగౌడ్‌పై కూడా కేసు నమోదు చేశామని తెలిపారు. సెబ్ ఎస్‌ఐ సోమశేఖర్‌రావు, హెడ్ కానిస్టేబుల్స్ తిరుపాలయ్య, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న మద్యంతో సెబ్ సీఐ